క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక



ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను కలిసిన బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు

పరవాడ: నియోజకవర్గంలోని పలు సమస్యలు పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ వ్యవస్థాపకుడు మళ్ల రమణబాబు కోరారు. రాంపురంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను బీసీ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరావు, కూండ్రపు కృష్ణంనాయుడు, సంఘ ప్రతినిధులు వై.ప్రశాంత్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: సబ్బవరం సెక్షన్–1 పరిధిలోని 33/11కేవీ, సబ్బవరం సబ్ స్టేషన్–11కేవీ పరిధిలోని విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా ఈ నెల 27న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సబ్బవరం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అప్పన్నను దర్శించుకున్న ఐఏఎస్ అధికారి



అప్పన్న సన్నిధిలో మధిమితా బసు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం భారత ప్రభుత్వ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ డైరెక్టర్ మధిమితా బసు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం అందజేశారు.

ఘనంగా దత్తాత్రేయుడి జయంతి



గోమాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో దత్తాత్రేయుడి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జామునే శ్రీదత్తపీఠం ఎదురుగా గోమాత పూజలు చేశారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ స్వహస్తాలతో అభిషేకాలు చేపట్టారు. హోమశాలలో శ్రీగణపతి సహిత దత్తాత్రేయ హోమం జరిపించారు. భక్తులకు గురుమాత అన్నపూర్ణమ్మ తీర్థప్రసాదాలు అందజేశారు.

దుప్పట్ల పంపిణీ



వృద్ధురాలికి దుప్పటి అందజేసిన ఎన్టీపీసీ ఉద్యోగి లక్ష్మి

పరవాడ: క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని సింహాద్రి ఎన్టీపీసీలో సబ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రుగడ లక్ష్మి సోమవారం 110 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. మండలంలోని సమ్మెంగపాలెం, దిబ్బపాలెం గ్రామాల్లో నిరు పేదలు, వృద్ధులకు వీటిని అందజేశారు. తనకు వచ్చే జీతంలో ప్రతీ నెలా రూ.5 వేల చొప్పున పొదుపు పేదల కోసం ఖర్చు చేసినట్టు చెప్పారు.

ఆశల సాగు



- ఉప్పు మడులు సిద్ధం చేస్తున్న రైతులు
- దళాయిపాలెంలో 300 ఎకరాల్లో ఉప్పు సాగు



ఉప్పుగల్లీల మరమ్మతు పనుల్లో నిమగ్నమైన కూలీలు (ఇన్‌సెట్) ఉప్పు పంటకు సిద్ధం చేసిన మడులు

పరవాడ: ఉప్పు సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోయిన ఉప్పు రైతులు వాటిని పూడ్చుకోవడానికి కోటి ఆశలతో ఉప్పుమడులు సిద్ధం చేస్తున్నారు. దళాయిపాలెంలో సుమారు 300 ఎకరాల్లో పంట సాగుకు ఉపక్రమించారు.

ఇదీ పరిస్థితి

ఏటా జనవరి నుంచి మే వరకు ఉప్పు పంట సాగు చేస్తారు. పంట సాగు కోసం నవంబరు, డిసెంబరు మాసాల్లో మడులను సిద్ధం చేస్తారు. ఉప్పు మడుల్లో పేరుకుపోయిన బురద, మట్టిని తొలగించి పంటకు సిద్ధం చేస్తారు. పంట పొలాలకు నీరందించే కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించి మడులకు ఏర్పాటు చేసిన గట్లను పటిష్టం చేస్తున్నారు. ఉప్పు నీటిని నిల్వ చేయడానికి అవసరమైన చెరువులను శుభ్రం చేసి అవసరమైనప్పుడు మడులకు నీటిని అందిస్తారు. ప్రస్తుతం ఉప్పు పంట సాగు చేసే రైతులంతా మడుల మరమ్మతు పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఫిబ్రవరి నుంచి ఉప్పు సేకరణకు సిద్ధమవుతారు. ఈ ఏడాది ఉప్పు పంట ఆరంభం నుంచి నవంబరు వరకు అడపాదడపా కురిసిన వర్షాలతో పాటు తుపానుల వల్ల ఉప్పు రైతులు నష్టపోయారు. నాణ్యత తగ్గడంతో 80 కిలోల ఉప్పు బస్తా రూ. 250నుంచి రూ.270కు మించి ధర పలకక పోవడంతో పెట్టుబడులు కూడా రాలేదని రైతులు లబోదిబోమంటున్నారు.

కూలీల కొరత ....

ఉప్పు రైతాంగాన్ని కూలీల కొరత పట్టిపీడిస్తుంది. ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, దళాయిపాలెం గ్రామాలకు చెందిన కూలీలు ఎన్టీపీసీ, ఫార్మాసిటీ జగనన్న కాలనీల్లో లభ్యమయ్యే కూలి పనులకు వెళ్లిపోతున్నారు. ఉప్పు గల్లీల్లో పనిచేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదని రైతులు చెబుతున్నారు. అయినా వృత్తిని కొనసాగిస్తున్నామంటున్నారు.

కూలి రేట్లు పెరిగిపోయాయి



ఉప్పు రైతును కూలీల కొరత పీడుస్తుంది. మగ కూలికి రూ.600, ఆడ కూలికి రూ.500 చెల్లిస్తున్నాం. అయినా కూలీలు దొరకడం లేదు. ఉప్పు పంటను సాగు చేయడం చాలా కష్టంగా ఉంది. పెట్టుబడులు, కూలి రేట్లు భారీగా పెరిగిపోయాయి. కష్టపడి పండించిన ఉప్పుకు సరైన గిట్టుబాటు ధరలు లభించడం లేదు.

– బూన రామకృష్ణ,
రైతు, గొరుసువానిపాలెం

కష్టమైనా..



ఏటా వాతావరణ పరిస్థితులు దెబ్బతీస్తున్నాయి. చేతికందివస్తున్న ఫలసాయం తుపానులు, అకాల వర్షాల వల్ల నష్టపోతున్నాం. అయినా పంట కలిసి వస్తే ప్రతిఫలం దక్కుతుందనే ఆశతో సాగుచేస్తున్నాం. రైతులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తే మరింత ప్రోత్సాహకంగా ఉంటుంది.

– బి.రామునాయుడు,
రైతు, గొరుసువానిపాలెం

క్రీడాభివృద్ధికి పెద్దపీట



క్రీడాకారులతో కలిసి మైదానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: యువతలో ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని రూపొందించారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. నియోజకవర్గ స్థాయిలో పినగాడి విస్తం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభం కానున్నాయి. దీంతో మైదానాన్ని సోమవారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ఉత్తేజం కలుగుతుందన్నారు. స్థానిక క్రీడాకారులతో ఎమ్మెల్యే కాసేపు క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు.

సబ్బవరం: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమవుతాయని ఎంపీడీవో రమేష్ నాయుడు తెలిపారు.5 క్రీడాంశాలకు సంబంధించి మండలంలో 4,600 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు చెప్పారు. సబ్బవరం సచివాలయం పరిధిలో నిర్వహించే క్రీడా పోటీలను ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ప్రారంభిస్తారని తెలిపారు.

పరవాడలో..

పరవాడ: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను సోమవారం ఉదయం 11 గంటలకు పరవాడ ఏపీఐఐసీ క్రీడా ప్రాంగణంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రారంభిస్తారని ఎంపీడీవో వి.హేమసుందరరావు చెప్పారు.

ఆటో డ్రైవర్లకు యూనిఫారాల పంపిణీ



ఆటో డ్రైవర్లకు యూనిఫారాలు అందించిన విశ్వనాథనాయుడు

పెందుర్తి: పెందుర్తి కూడలిలోని పైడిమాంబ ఆటో డ్రైవర్ల యూనియన్ ప్రతినిధులతో మాజీ జెడ్పీటీసీ కంచిపాటి విశ్వనాథనాయుడు సోమవారం సమావేశమయ్యారు. స్థానిక తాండ్రపాపారాయుడు కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో దాదాపు 80 మందికి యూనిఫారాలు పంపిణీ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఆటో యూనియన్ ప్రతినిదులు పాల్గొన్నారు.

కరుణామయుడు ఏసుక్రీస్తు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- ఘనంగా క్రిస్మస్ వేడుకలు



రాంపురం చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



సాయినగర్ చర్చిలో నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: ఏసుక్రీస్తు జన్మదినం పురస్కరించుకుని క్రిస్మస్ వేడుకలను సోమవారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు ఏసు సందేశాన్ని ప్రజలకు అందజేశారు.సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. క్రిస్మస్ తాతల వేషధారణల్లో సందడి చేశారు.

పేదలకు చీరల పంపిణీ

రాంపురం చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని కేక్‌కట్ చేశారు. 40 మంది నిరుపేద కుటుంబాలకు చీర, బియ్యం బస్తా, కిలో పప్పు, కిలో పంచదార చొప్పున అందించారు. ఏసు క్రీస్తు కరుణామయుడు అని అన్నారు. పెందుర్తిలోని పెంతెకొస్తు చర్చి, చినముషిడివాడ ఆంధ్రా బాప్టిస్ట్ చర్చితో పాటు వేపగుంటలోని ఏసుమందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిల ప్రతినిధులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. పెందుర్తి ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. సంతోష్‌నగర్ న్యూవే న్యూలైఫ్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాస్టర్‌లు సందేశాన్ని ఇచ్చారు. సుజాతనగర్ అగాపే చర్చిలో పాస్టర్ ప్రవీణ్‌థామస్ సందేశాన్ని అందించారు. కృష్ణరాయపురం, చినముషిడివాడ, పురుషోత్తపురం, గొరపల్లి, పెదగాడి, పినగాడి, రాంపురం, లక్ష్మీపురం, వరలక్ష్మీనగర్, పాపయ్యరాజుపాలెం, చింతలగ్రహారం తదితర ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి.

సబ్బవరం: మండలంలోని పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సబ్బవరం సాయినగర్ చర్చిలో నిర్వహించిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చర్చిలోని సుమారు 75 మంది కుటుంబ సభ్యులకు 5 కిలోల రైస్ బ్యాగ్‌లతో పాటు కిలో పంచదార,కిలో కంది పప్పు చొప్పున ఎమ్మెల్యే సొంత నిధులతో అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ప్రతినిధి కొటాన రాము, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ,పార్టీ నాయకులు సబ్బవరపు నాగభూషణం,సబ్బవరపు సత్యనారాయణ,యర్రంశెట్టి రాము,ఐడీ బాబు,బోను గంగు నాయుడు పాల్గొన్నారు.

సామాజిక అసమానతలకు మూలం మనువాదం



మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న సమాఖ్య సభ్యులు

మల్కాపురం: సామాజిక అసమానతలకు మూలం మనువాదమేనని దళిత హక్కుల సమాఖ్య అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ అన్నారు. 53వ వార్డు నరేంద్రనగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో మనుధర్మ శాస్త్ర దహన దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. అక్కడి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మనుస్మృతి వద్దు.. మానవత్వం ముద్దు, కుల వ్యవస్థకు మూలమైన మత గ్రంథాలను వీడాలని, కుల నిర్మూలనా పోరాటాలు వర్ధిల్లాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ 1927 డిసెంబర్ 25న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మనుధర్మ శాస్త్రాన్ని దహనం చేశారని గుర్తుచేశారు. మాకవరపాలెం జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కొరివి సుందరరావు మాట్లాడుతూ కుల వ్యవస్థలకు మనుస్మృతి మూలమైందన్నారు. దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ, ప్రతినిధులు బంకపల్లి అప్పారావు, సన్యాసమ్మ, గుడివాడ అప్పారావు, రవికుమార్, నూకరాజు, విజ్ఞానంద్ రాంప్రభు, రాంజీ, దుర్గారావు పాల్గొన్నారు.

నమో శివరుద్రాయ

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామికి బిల్వపత్రాలతో పూజలు చేశారు. మహిళలు ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పలు రకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. హర నామస్మరణ మార్మోగింది.

బి.ఎస్.రెడ్డికి అటల్ గౌరవ్ సమ్మాన్ పురస్కారం



అవార్డు అందుకుంటున్న బి.ఎస్.రెడ్డి

సీతంపేట: అంతర్జాతీయ మెజీషియన్, నగరవాసి బి.ఎస్.రెడ్డి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ అటల్ గౌరవ్ సమ్మాన్–2023 అవార్డును కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి మహేంద్ర కలుభాయ్ ముంజపర చేతుల మీదుగా అందుకున్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా అటల్ ఫౌండేషన్ సోమవారం న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అత్యంత ప్రతిభ కలిగి దేశవిదేశాల్లో తమ ప్రతిభ పాటవాలతో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన వారి సేవలకు గుర్తుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బి.ఎస్.రెడ్డిని నగరానికి చెందిన పలువురు మెజీషియన్లు అభినందించారు.

యువతి అదృశ్యం

మల్కాపురం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మురళీనగర్ సింగరాయిమెట్ట ప్రాంతంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న పైడి మానస బీటెక్ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటోంది. తరచూ అక్కడి వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సేవకు వెళ్తుంటారు. సోమవారం ఉదయం 4 గంటల సమయంలో సేవకు వెళ్తానని చెప్పి సదరు యువతి ఇంట్లో నుంచి వెళ్లి సాయంత్రం దాటినా రాకపోవడంతో అంతటా వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో సోమవారం రాత్రి తండ్రి పైడి నర్సింగరావు ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి నేతృత్వంలో ఏఎస్ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు శ్రీకాంతాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శ్రీరాముడిగా అప్పన్న



రామాలంకరణలో అప్పన్న ఉత్సవమూర్తి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి రామాలంకారంలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీరాముడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అదిష్ఠింపజేశారు. ఆళ్వారులను వేరే పల్లకీలో వేంచేయజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మార్మోగిన హరినామ కీర్తనలు



వాడచీపురుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

పరవాడ: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా వాడచీపురుపల్లిలో సోమవారం మేలు కొలుపు నిర్వహించారు. దేవాలయం కేంద్రంగా భక్తులంతా హరి నామ సంకీర్తనలు ఆలపిస్తూ పల్లకీలో భగవంతుడిని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో భాగంగా అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను గ్రామ ధార్మిక జట్లకు అందజేశారు. అంక్షితలను దేవాలయంలో ఉంచి శ్రీరామ మంత్రాన్ని 108 సార్లు జపించి హనుమాన్‌చాలీసా పఠించాలని సూచించారు. జనవరి 1 నుంచి 7 వరకు ప్రతీ ఇంటికి రామయ్య అక్షింతలు, అయోధ్యకు రావాలని ఆహ్వాన పత్రాన్ని అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా శ్రీ శాస్త్ర కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో శ్రీపూర్ణ పుష్కళ సమేత శ్రీధర్మశాస్త్ర(అయ్యప్పస్వామి) కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. శబరిమల మేల్ శాంతి విష్ణు నంబూద్రి సారథ్యంలో పురోహితులు సుబ్రహ్మణ్య శర్మ, మారుతి, ప్రసాద్ ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా జరిపారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, రాధా మల్లిక దంపతులు పూజల్లో పాల్గొన్న దంపతులకు నూతన వస్త్రాలు అందించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

కాపుల ద్రోహి పవన్ కల్యాణ్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కాపు నేతలు

సీతమ్మధార: గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కాపులకు అన్యాయం చేసిందని, అటువంటి పార్టీకి మద్దతు పలికి కాపుల ఆత్మాభిమానాన్ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలుగుదేశానికి తాకట్టు పెట్టారని వైఎస్సార్‌సీపీ కాపు నేతలు మండిపడ్డారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ ఉత్తర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ కాపు యువత ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబును కాపు నాయకులు కలవాలంటే అపాయింట్మెంట్ ఇచ్చే వారు కాదని, అలాంటి పార్టీకి మద్దతు పలుకుతూ పవన్ కల్యాణ్ కాపుల ద్రోహిగా మారారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన మద్దతుతో పోటీ చేసిన ప్రతి ఒక్కరినీ ఓడించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధిని కొనసాగించేలా అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్, సమ్మిట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

ఏయూ క్యాంపస్: స్థానిక జాలరి ఎండాడలో దుర్గాలమ్మ గుడి దగ్గర నివాసం ఉంటున్న వాడమోదుల పోలమ్మ(53) ఆదివారం మధ్యాహ్నం అనుమానాస్పదంగా మృతి చెందింది. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వాడమోదుల పోలమ్మ జాలరి ఎండాడలో దుర్గాలమ్మ గుడి దగ్గర చిన్న గదిలో నివాసం ఉంటోంది. ఈమె భర్త గతంలోనే మృతిచెందారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారులు ఉన్నారు. ఆదివారం ఆమె ఆకస్మికంగా మృతి చెందింది. అదే సమయంలో ఆమె ముక్కుకు ఉండే బంగారు ఆభరణాలు కనిపించడం లేదు.మృతురాలి సోదరి అంకమ్మ ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. బంగారం కోసం ఎవరైనా హత్య చేశారా?, లేక చనిపోయిన తరువాత బంగారం ఎవరైనా దొంగలించారా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.